



**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

"రవి గారూ, మీ దగ్గర ఛార్జి తీసుకున్నప్పుడే మీకు చెప్పాను. మరోసారి గుర్తు చేస్తున్నాను. మీలాకర్లో దొరికిన డాక్యుమెంట్లో కాపీలన్నీ మీమీద కంప్లెయింట్ చేసిన వ్యక్తి హెడ్డాఫీసుకు పంపాడు. అతనికా కాపీలెట్లా వచ్చాయి? అవి సేకరించడానికి ఎవరికి అవకాశం ఉంది? దీని మీద మీరు దృష్టి పెట్టండి. మీ కెవరిమీద అయితే అనుమానం ఉందో ఆ వ్యక్తిని మీరు ప్రశ్నించవద్దు. ఆపనేదో ఎంక్వయిరీ ఆఫీసరే చేస్తాడు. అయితే మీకు అనుమానం ఉన్న వ్యక్తి పేరుని మాత్రం ఎంక్వయిరీ ఆఫీసరుకు చెప్పాలి. మీ ట్రాక్ రికార్లు ప్రకారం మీ నిజాయితీ మీద హెడ్డాఫీసుకు ఎటువంటి అనుమానాలు లేవు. కాని వచ్చిన కంప్లెయింటు, ప్రైమాఫేసీ ప్రకారం వాళ్లు యాక్షన్ తీసుకోవాలి గనుక, తీసుకున్నారు. ఇది తాత్కాలికమే అని భావిద్దాం. మీ సిన్సియారిటీని మీరు ఋజువు చేసుకోండి. కాగల కార్యం ఎంక్వయిరీ ఆఫీసరే నెరవేరుస్తాడు' విష్ యూ ఆల్ సక్సెస్"

ఆ మాటలు కొండంత బలాన్ని ఇచ్చాయి. విచార పర్వాన్ని అధిగమించి కర్తవ్యోన్ముఖుడయ్యాడు రవి,

తన సేఫ్లాకర్లో ఉన్న (1) ఎన్ఎస్సిలు, (2) తను అమ్మిన ఎపార్టుమెంట్ సేల్ డిడ్ (8) వంశీ పేర కొన్న ఇంటి దస్తావేజులు (4) తన ఎల్.ఐ.సి పాలసీలు —— ఇవన్నీ తనకు తప్పఇంకెవరికి తెలుస్తాయి? ఒక వేళ తెలిస్తే తన పి.ఎకి తెలియవచ్చు! అవును, సడెన్గా గుర్తిచ్చింది వాడికే తెలుస్తాయి! తెలియడమేమిటి వాడే ఈ కంప్లయింట్కు సూత్రధారి కావచ్చు కూడ. ఒక్కొక్కటి గుర్తుకొస్తున్నాయి.

ఏటా తను ఐటి రిటర్ను సబ్మిట్ చెయ్యాలి. ఈ పనింతా తన పిఎ చేస్తాడు. తన దగ్గరున్న ఇన్ఫర్మేషన్, డాక్యుమెంట్లు అన్నీ వాడికే ఇస్తాడు తను. యస్. వాడే వాటి కాపీలు తీసుకుని అదనంగా మరొ కాపీని తన దగ్గర పెట్టుకుని వాటిని ఐటిఓకు సబ్మిట్ చేస్తాడు. చేశాడన్నమాట. ఆ కాపీలను తన మీద కంప్లెయింటుకు ప్రైమాఫేసీగా సబ్మిట్ చేసాడన్నమాట! ఎంతదుర్మార్గం! వాడి పేరుని బట్టే వాడు భుజంగం.  యస్. వాడికే తన మీద కోపముంది, పీకలదాక.

ఒక సంవత్సరం క్రితం ఈ భుజంగరావు మీద, ఒక ఇండస్ట్రియలిస్టు కంప్లెయింటు చేశాడు. 'తనకు లోన్ ఇప్పిస్తానని తన దగ్గర పదివేలు తీసుకున్నాడని, మరో పదివేలు మా బాస్ కివ్వాలని తీసుకున్నాడని. కాని తనకు లోన్ రాలేదని – "దీనికి మీరేం చెబుతారు? నాకు లోన్ ఇప్పించండి, చాలు! నేనేం గొడవపెట్టను" అని భుజంగరావు లేనప్పుడు డైరెక్టుగా తనకే కంప్లెయింట్ చేశారు. ఇటువంటి కంప్లెయింట్లు మరికొన్ని తనకి వచ్చాయి.

భుజంగాన్ని పిలిచి అడిగాడు "ఏమిటీ గొడవ" అని. వాడు ఇంతెత్తున లేచాడు. "ఏమిటిసార్, ఇంత నిజాయితీగా పని చేస్తున్న నన్నేమీరనుమానిస్తున్నారు ఇది అన్యాయం! నాకే పాపం తెలియదు. మీకు కంప్లెయింట్ చేసినవాడు నన్ను ఎప్రోచ్ అయి "నాకులోన్ ఇప్పించండి, మీకు 20వేలు ఇస్తాను" అన్నాడు. నీకు లోన్ ఎలిజిబిలిటీ ఉంటే వస్తుంది. అంతే కాని మీ లంచానికి ఆశించి నేనేం చెయ్యను అని కరాకండీగా చెప్పేశాను. వాడికి లోన్ రాకుండా నేనే తన మీద చాడీలు చెప్పి చేశానని మీకిలా అబద్ధాలు చెబుతున్నాడు" అని నమ్మకంగా పలికేడు.

భుజంగం మీద కంప్లెయింట్లు అంతటితో ఆగలేదు. మరో ఇద్దరు లోన్కి అప్లయ్ చేసిన వాళ్లు తనకు చెప్పారు.  వ్రాత పూర్వకంగా కంప్లెయింటు ఇచ్చారు. ఇది తన బాధ్యతని మరింత పెంచింది. తను భుజంగానికి వార్నింగ్ మెమో ఇచ్చాడు. కాని వాడి బుద్ధి మారలేదు. పైపెచ్చు తన మీద ఆఫీసులోనూ, బయటా ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. మరల మరో వార్నింగ్ ఇచ్చి "ఇది ఫైనల్ నువ్వునీ ప్రవర్తనని సరిదిద్దుకోకపోతే నీ మీద యాక్షన్ తీసుకోవలసిన వస్తుంది. ప్రస్తుతం నీ రిపైని వెంటనే నా కివ్వు" అని చెప్పాడు తను. దానికి వాడు నానాయాగీ చేసి కాళ్ల మీద పడ్డాడు. అంత కఠినంగా వార్నింగ్ ఇచ్చినా వాడి మీద ఏమీ యాక్షన్ తీసుకోలేదు. కనీసం పిఎ పోస్టు నుండి తప్పించలేదు. కాని వాడు తన మీద పగపట్టాడు. ఆ పగ హెడ్డాఫీసుకు ఋజువులతో సహా కంప్లెయింట్ ఇచ్చి తీర్చుకున్నాడు. వాటి కాటుకు తను సస్పెండ్ అయ్యాడు! భుజంగరావు కన్న తన కెవరూ శత్రువులు లేరు. ఇంటా బయటా " ఈ సంగతులే ఎంక్వయిరీ ఆఫీసరుకు చెబుదాం అనుకుని కొంతమేరకు సేద తీరాడు.

****

ముందే అందించిన సమాచారం మేరకు హెడ్డాఫీసు నుండీ ఎంక్వయిరీ ఆఫీసరు, కృష్ణమోహన్ వచ్చాడు. కూడా ఒక అసిస్టెంటు వచ్చాడు. కృష్ణమోహన్ వివరాలు శ్యామ్సుందర్ చెప్పాడు, అతను డైరెక్టు రిక్రూట్ అందువలన చిన్న వయస్సులోనే ఎజియం కేడర్ కి ప్రమోట్ అయ్యాడు. ఆఫీసు వ్యవహారాల్లో అతని నిజాయితీకి మంచి పేరున్నది. యం.ఎ. సైకాలజీ మనుషుల మనస్తత్వాలను అర్థం చేసుకునే సబ్జెక్టుకు తగిన వ్యక్తిగా పేరు పొందాడు. న్యాయంగా రవి మీద ఎంక్వయిరీకి జిఎం కేడర్ ఆఫీసరు రావాలి, కాని ఆ సమయానికి ఆ కేడర్ ఆఫీసర్ (ఎంక్వయిరీ విభాగం) లాంగ్లీవ్లో ఉండటం వలన కృష్ణమోహన్ ప్రతిభావిశేషాలు తెలియడంతో అతన్నే ఎంక్వయిరీకి పంపించారు, కృష్ణమోహన్ రాగానే ఎజియం ఛాంబర్కి తన అసిస్టెంటుతో చేరుకుని శ్యామ్సుందర్తో సమావేశం అయ్యాడు. కేసు పూర్వాపరాలు పూర్తిగా అవగతం అవడంతో డైరెక్టుగా విషయం విచారించి రంగంలోకి దిగాడు!

"'శ్యామ్సుందర్, మీరొక సారి ఛాంబర్ బయటకు వెళ్లి మీ పి.ఎ తో సహా బ్యాంకులోని ఆఫీసర్స్ని, పిఎని ఇంకా మీ బ్యాంకులోపలి పరిసరాల మీద ఒక కన్నేసి ఉంచండి. మీకు ఏ క్లూలు దొరికినా నాకు తర్వాత చెప్పండి. ఈలోపు నేనూ నా అసిస్టెంటూ ఛాంబర్ లోపల, కప్బోర్డుల్లోనివి పరిశీలిస్తాం, మా అసిస్టెంటు రాజు మిమ్మల్ని పిలిచాక లోపలికి రండి". శ్యామ్ సుందర్ వెంటనే ఛాంబర్ బయటకు వెళ్లి పిఎ ముందు కూర్చున్నాడు.

★★★

సరిగా 45నిముషాల తర్వాత తన అసిస్టెంటు రాజు ఛాంబర్ బోల్టు తొలగించి, శ్యామ్సుందర్ని లోపలికి పిలిచాడు. ఈ 45ని"లు ఛాంబర్లో కృష్ణమోహన్, రాజు తప్ప ఎవ్వరూ లేరు. ఛాంబర్ అద్దాలకు లోపల ఉన్న కర్టెన్సుని పూర్తిగా మూసి ఉంచడంతో అక్కడేం జరిగిందో ఆ ఇద్దరికే తప్ప ఎవరికీ తెలియదు.

"శ్యామ్ సుందర్, ఏమన్నా విశేషాలున్నాయా?"

"లేదు కృష్ణమోహన్, ఛాంబర్ వెలుపల అంతా నార్మల్ లోపలికి ఎవరూ తొంగిచూడలేదు."

ఈలోపులో కాఫీలు వచ్చాయి. కృష్ణమోహన్ తన బ్రీఫ్కేస్ తీసుకుని లేచాడు.

"శ్యామ్సుందర్! మన బ్యాంక్ గెస్ట్ హౌస్ లోనే ఎంక్వయిరీ సాగిద్దాం. మనకెలాగూ అక్కడే స్టే ఏర్పాటు చేశారు గనుక ఎంక్వయిరీ గూడ అక్కడే చేద్దాం." అని మరలా కూర్చుని "బ్యాంకులోని ఆఫీసర్స్ని, రవిగారి పిఏని లోపలికి పిలిపించండి. వాళ్లని నాకు పరిచయం చెయ్యండి." అన్నాడు.

బ్యాంకు ఆఫీసర్స్, పిఏ లోపలికి వచ్చాడు. వాళ్లని ఎంక్వయిరీ ఆఫీసర్ కి పరిచయం చెయ్యడం జరిగింది. వాళ్ల వైపు తిరిగి "ఎంక్వయిరీ వివరాలు, వెన్యూ, టైమింగ్స్ అన్నీ శ్యామ్సుందర్ గారూ మీకు చెబుతారు. మీరు సరిగా వారు చెప్పిన టైముకు రావలిసి ఉంటుంది." అన్నాడు.

శ్యామ్సుందర్కి ఎవరెవరినీ ప్రశ్నించాలో వివరాలు, టైమింగ్ చెప్పి కృష్ణమోహన్,రాజు గెస్టు హౌస్కు బయలుదేరారు.

బెంగుళూరు సిటీ బ్రాంచి – 1, ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రవి మీద ఎంక్వయిరీ ప్రారంభమయింది. బ్యాంకు గెస్టు హౌస్లోని ఎగ్జిక్యూటివ్ సూట్లో ఎంక్వయిరీకి శ్యామ్సుందర్ అన్ని ఏర్పాటు చేశాడు. ఎవరయితే ప్రశ్నించాలో వాళ్లే తప్ప ఆ సమయంలో మరెవరూ ఉండకుండా అక్కడొక సెక్యురిటీ గార్డునీ నియమించాడు. ఎవరువస్తున్నారో, తేదీ, టైమింగ్స్ – ప్రకారం లిస్తుని ఏరోజుకారోజు సెక్యూరిటీ గార్డుకిచ్చి వాళ్లనే లోపలికి పంపేటట్లు ఏర్పాటు జరిగింది.

ముందుగా బ్యాంకు వాచ్ మేన్ నాగేశ్వర్రావు, స్వీపర్ నరసమ్మలను పిలిపించారు. నాగేశ్వరరావు లోపలికి వచ్చి, కృష్ణమోహన్కి శాల్యూట్ చేశాడు. రాజు ప్రక్కనే కూర్చుని ప్రశ్నలూ, సమాధానాలు రికార్డు చేసే ఏర్పాటు జరిగింది. వాచ్మెన్ని ప్రశ్నిస్తే క్లూలు ఏమీ దొరకలేదు. స్వీపర్ నర్సమ్మలోనికి వచ్చింది.

కృష్ణ : పేరు, వివరాలు అడిగి తెలుసుకుని "నువ్వెన్ని గంటలకు వస్తావు?"

నర్సమ్మ : ఉదయం 6గం.లకు వచ్చి 10 గంటలకు బ్యాంకు ప్యూనుకి తాళ్ళాలిచ్చి నేను వెళ్తాను.

కృమో : ఆఫీసరు వినయ్ వచ్చిన రోజున నువ్వే వచ్చావా? ఆరోజున 10గం॥లోపులో ఎవరైనా వచ్చారా? బాగా జ్ఞాపకం చేసుకుని చెప్పు..........

నర్సమ్మ : (ఆలోచించి) ఆరోజున ఉదయం అందరి కన్నముందు భుజంగరావు బాబుగారు వచ్చారు సార్!

కృ, మో : ఎన్ని గంటలకో చెప్పగలవా?

నర్సమ్మ : సుమారు 9 గం.కు అనుకుంటాను. ఆ రోజున ఎందుకో ఆయన లోపలికి వెళ్లి గెడపెట్టుకుని కొంతసేపు పోయాక గెడతీసి నన్ను లోపలికి పిలిచి క్లీన్ చేయించారు.

కృ, మో : నర్సమ్మా నువ్విక వెళ్లవచ్చు.

అదే రోజు లంచ్ అయ్యాక బ్యాంకు ఆఫీసర్లు రమణ, విజయ్, శాస్త్రీల విచారణ ప్రారంభం అయింది. అందర్నీ ఒకేసారి లోపలికి పిలిచారు.

కృమోః మీ బ్రాంచిమేనేజర్ రవి గారి గురించి చెప్పండి.

ముగ్గురూ ఒకేసారి “ఆయన చాల మంచి వారు సార్ ఎవర్నీనొప్పించరు. ఆయన నిజాయితీకి మేమూ తలవంచి మా మీద ఎటువంటి కంప్లెయింట్లు రాకుండా పనిచేస్తాం.” అన్నారు. అందరూ నిష్క్రమించారు.

★★★

మర్నాడు ప్రశించబడే వ్యక్తి రవి పిఎ భుజంగరావు. అతను ప్రవేశించి కృష్ణమోహన్కి నమస్కరించి కూర్చున్నాడు.

కృమో : భుజంగరావు గారూ, మీరు రవిగారు వచ్చినప్పటి నుండి ఆయనకు పి.ఎ. గానే ఉన్నారా?

భు : అవునుసార్,

కృమో : రవిగారు అఫీషియల్గా, వ్యక్తిగా ఎటువంటి వారు?

భు : ఆయన ఎజియంగా అందరి మన్ననలను పొందినవారు. తన క్రింద పని చేసేవారిని ఎప్పడూ ఏమీ తూలనాడటం నేను చూడలేదు.

కృమో; మరి వ్యక్తిగా?

భు. : వ్యక్తిగా కూడ మంచివారే ! ఎవరికీ అపకారం చేసినట్లు నేను చూడలేదు.

కృమో; ఆయనతో మీ సంబంధాలు ఎలాగున్నవి?

భు : సవ్యంగానే ఉన్నాయి, సార్!

కృమో; ఆఫీసులో, ఆయన దగ్గర మీరేమేమి పనులు చేస్తారు?

భు: అఫీషియల్గా కాన్ఫిడెన్షియల్ మేటర్స్ నా ద్వారానే పై ఆఫీసులకు, హెడ్డాఫీసుకు పంపిస్తారు. ఆఫీసు స్టాఫ్ ఫైళ్లన్నీవారి ఛాంబర్లోని కప్ బోర్డులో పెట్టడం, తియ్యడం నా పనే.

కృమో : ఇంకా?

భు : ఎజియమ్ గారి పెర్సనల్ కరస్పాండెన్స్ నేనే చేస్తాను. ఇంకా వారి ఐటి రిటర్నులు యేటా నేనే తయారు చేసి ఐటిఒ కి పంపిస్తాను. వాటి ఎస్సెస్మెంట్, ఫాలోఅప్, క్వెరీల ఆన్సరింగ్ లాంటివి నేనే చేస్తాను.

కృమో : ఐ.టి. రిటర్నుకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఆయన మీకిస్తారా? ఆ ఒరిజినల్స్ ఐటికి పంపిస్తారా?

భు : లేద్సార్ డాక్యుమెంట్ల కాపీలు మాత్రమే పంపుతాం.

కృమో, : (భుజంగరావు వైపు సూటిగా చూసూ) డాక్యుమెంట్ల కాపీలు ఎక్కడ తీస్తారు ? ఫోటోస్టాట్ మిషనెక్కడ ఉంది. బ్రాంచిలో అదెక్కడ పెడతారు?

భు : అది బ్యాంకులో సార్ ఛాంబర్లోనే ఉంది. నేను వారి డాక్యుమెంట్ల అక్కడే, ఆయన ఎదురుగానే తీసి ఒరిజినల్స్ వారికిచ్చేసాను. ఇది ఏటా జరుగుతున్నదే!

కృ, మో ; వారి ఐ.టి. రిటర్నుకు ఏ మేమి డాక్యుమెంట్స్ మీ కిస్తున్నారు?

భు : కావలిసినవన్నీ !

కృ, మో: అదే, ఏమిటవి? ఏటా మీరు చేసే పనేగా ఇది ఐ.టి. రిటర్న్కి కావలసిన డాక్యుమెంట్లు ఏమేమిటి? గుర్తుతెచ్చుకుని చెప్పండి.

భు : (కొంచెం జంకాడు) అవి (1) జనరల్గా, బ్యాంకు ఇచ్చే వారి ఆదాయం, సేలరీ డిడక్షన్, ఐ.టి. డిడక్షన్స్ ఎటోస్ర్స్ మొదలైనవి (2) ఇన్సూరెన్స్ పాలసీల నెంబర్లు, ప్రీమియంలు, (3) ఎన్నెస్సి ల కాపీలు (4) ఇంకా ఇతర డాక్యుమెంట్లు

కృ, మో: అదే ఆ ఇతరడాక్యుమెంట్ల సంగతి? ఈ సంవత్సరం ఆయనిచ్చిన వాటి వివరాలు?

భు : నాకే మాత్రం గుర్తులేదు.

కృ, మో: నేను గుర్తు చెయ్యనా?

భు : మీకెల్లా తెలుస్తుంది, ఆయన ఐటి వివరాలు, డాక్యుమెంట్స్?

కృమోః అహ, సహజంగా ఒక సీనియర్ ఆఫీసర్కి ఉండేవని నా ఊహ, ఇంటి డాక్యుమెంట్లు, ఇల్లు అమ్మితే సేల్ డీడ్.

భు : (మరల ఖంగు తిన్నాడు) అవును సార్ గుర్తిచ్చింది. ఈ సంవత్సరం ఆయన క్రొత్తగా కొన్న ఇంటి డాక్యుమెంటు కూడా ఉన్నట్లు గుర్తు.

కృమోః ఆ డాక్యుమెంటు ఎవరి పేర ఉన్నది?

భు : నేనా వివరాల్లోకి వెళ్లను సార్, అందుచేత గుర్తు లేదు.

కృమోః : సరే ఇక ఇతర విషయాల్లోకి వద్దాం. రవి గారితో మీకే రకమైన విరోధంగాని, అభిప్రాయ భేదంగాని ఉన్నదా?

భు: నాకెందుకుంటుంది! ఆయన చెప్పింది చేయడమే నాపని. ఇందులో అభిప్రాయ భేదాలకి అవకాశం ఎక్కడుంటుంది?

కృమో : ఎందుకుండదు ? ఒకవేళ మీరు చేసిన పని ఆయనకు నచ్చకపోవడం, ఆయనిచ్చిన ఆర్డరు మీకు అనుకూలంగా లేకపోవడం లాంటివి ఉండవచ్చుకదా!

భు : నాకు నచ్చినా నచ్చక పోయినా, ఆయన నా సుపీరియర్ ఆఫీసర్ గనుక, నేను ఫాలో అవడమే నా పని, ఇక నా పనులు ఆయనకు నచ్చక పోవడం అంటూ ఏం లేదు. ఆయన చెప్పినట్లుగానే నేను నడచుకుంటున్నాను గనుక ఆ సమస్య రాదు.

కృమో : ఆయన మీకెప్పడైనా వార్నింగ్ మెమోలిచ్చారా? ఏ సందర్భంలో?

భు: ఇచ్చారు సార్ కొందరు పారిశ్రామికవేత్తలు, నా మీద లేనిపోని అపవాదులతో కంప్లెయింట్స్ ఇచ్చినపుడు వార్నింగ్ లిచ్చారు!

కృమో : ఓరల్గానా, వ్రాత పూర్వకంగానా?

భు : రెండూనూ...!

కృమో : వ్రాత పూర్వకంగా మీమీద కంప్లెయింట్స్ వచ్చాయా?

భు : వచ్చాయి, అప్పడే ఆయన నాకు వ్రాతపూర్వకంగా వార్నింగ్ మూల ఇచ్చేరు.

కృమో : మీమీద డిసిప్లినరీ యాక్షన్ ఏమైనా తీసుకున్నారా?

భు. : లేద్సార్ ఆయన చాలా మంచివారు. కేవలం వార్నింగ్లతోనే సరిపెట్టారు.

కృమో : అయితే మీకాయన మీద కోపం లేదా?

భు : నాకెందుకుటుంది? ఏ మాత్రం లేదు. పైపెచ్చు ఆయనకు కృతజ్ఞతలు చెప్పకోవాలి..!

కృమో : మరి ఈ రకమైన యాక్షన్ ఆయనమీద ఎందుకు తీసుకున్నారు, హెడ్డాఫీసు వారు?

భు : అది నాకెలా తెలుస్తుంది?

కృమో : ఆయన కప్ బోర్డు మీరూ, ఆయన తప్ప ఎవరూ తెరవలేరు, అట్టి పరిస్థితుల్లో వారి ఛాంబర్ కప్బోర్డులోకి 25,000 రూపాయలున్న కవరు ఎవరు పెట్టారు?

భు: నేను పెట్టలేదు. ఆయన పెట్టారేమో. ఎందుకంటే ఆయన లేనప్పుడు ఆ కప్ బోర్డు నేను ఆపరేట్ చేయను గనుక,

కృమో : సరే మీ ఎంక్వయిరీలో అన్నీ నిజాలే చెప్పాలి. ఏమాత్రం అబద్దాలు చెప్పినట్టు ఋజువయినా మీమీద శిక్ష మరింత పెరుగుతుంది. ఇది గుర్తు పెట్టుకోండి. మళ్లీ మిమ్మల్ని రేపు పిలిపిస్తాం. ఇక మీరు వెళ్లవచ్చు. మళ్లీమిమ్మల్ని పిలిచినప్పుడయినా, ఇప్పుడు అబద్దాలు చెబితే నిజాలు చెప్పాలి. ఇది మీకు హెచ్చరిక!

భు : అల్లాగేసార్. నేనెప్పుడూ నిజాలే చెబుతాను. సెలవు.

★★★

కృష్ణ మోహన్ ఎంక్వయిరీ ఒక్క రవి మీద తప్ప దాదాపు పూర్తయింది. అదే రోజు రవిని పిలిపించారు.

కృమో : రవిగారూ మీతో ఈ ఎంక్వయిరీ ముగుస్తుంది. కాని రేపు మరల ఇంకొకర్ని పిలుస్తాం. ఇప్పుడు చెప్పండి. మీ కెవరి మీద అనుమానమున్నదో నాకు చెప్పారు. ఇప్పటికీ అదే మాట మీదున్నారా?

రవి : అవును. వాడే ఈ కంప్లెయింట్ డాక్యుమెంట్సుతో సహా ఇచ్చి ఉంటాడు.

కృమోః సరే ఆ డాక్యుమెంట్స్, లాకర్లోని ఇతరాల మీద ఇప్పుడు మిమ్మల్ని ప్రశ్నిస్తాను. 30గ్రాములు బంగారం ఎప్పుడు కొన్నారు?

రవి : నేను ఆఫీసర్ అయ్యి 30 సంవత్సరాలయింది. గతంలో ఇప్పుడున్నంత రేటు బంగారానికి లేదు. అందువలన అప్పడప్పుడూ కొన్నవే ఆ నగలు. అయితే కొన్న వాటికి రశీదులు నా దగ్గరలేవు. నా భార్య దగ్గరున్న మంగళసూత్రాలు, గాజులు మా పెళ్లికి అత్తగారు పెట్టినవి, మా నాన్నగారూ చేయించినవి. ఇక లాకర్లో, ఉన్న 80 తులాలు నేనప్పడప్పుడు కొన్నవి చేయించినవి.

కృమోః రవిగారు, మీ వ్యక్తిగత వివరాల్లోకి వెళ్తున్నందుకు క్షమించండి. అయినా మీరిచ్చే వివరాలు నా ఎంక్వయిరీలో మీకు సహకారం జరగడానికి పనికి వస్తాయని అర్థం చేసుకోండి

రవి : మీ సూచన విని నేను థ్యాంక్స్ చెబుతున్నాను. అయినా నేనిప్పుడు చెప్పేవి జనరల్గా అందరిళ్లతోనూ జరిగేవే. నా భార్య కూడ సాంప్రదాయమైన కుటుంబంలోంచి వచ్చింది. పిల్లల ఫీజులు, కుటుంబ ఖర్చులూ అన్నింటికి నేను తెచ్చిన నా నెట్ జీతంలో నుండి కొద్దిగా నా ట్రాన్స్పోర్టు, పాకెట్ ఎక్స్పెన్సెస్ మాత్రం తీసుకుని మిగిలిందంతా ఆమెకే ఇచ్చేస్తాను. ఆ డబ్బుని పొదుపుగా వాడి ప్రతిసంవత్సరం కొంత మిగులుస్తుంది. ఆ మిగిలిన డబ్బుతో ఏటా ఒకటి రెండూ నగలు చేయించుకుంటుంది. మా లాకర్లోని నగలన్నీ అలా చేయించుకున్నవే.

కృమోః హేట్సాఫ్ టూ యువర్ శ్రీమతి! ఇక ఇళ్ల డాక్యుమెంట్లు లోనికి వద్దాం. మీ అబ్బాయిపేరన ఉన్న ఇల్లు డాక్యుమెంట్లో 70 లక్షలుగా ఉన్నది. అది రిజిస్ట్రేషన్ కోసం తగ్గించి వ్రాసిందా మొత్తం అసలు రేటు అదేనా?

రవి : ఏవీ తగ్గించలేదు. ఎందుకంటే ఆ 70లక్షల్లో వాడికి నేను 30 లక్షలిచ్చారు. అది కట్టి మిగిలిన 40 లక్షలకు లోన్ పెట్టాడు. అందుచేత తగ్గించే అవకాశం లేదు.

కృమోః మీరిచ్చిన 30 లక్షలు మీకెక్కడివి?

రవి : నేను సర్వీసులో చేరిన కొద్దికాలంలోనే ఒక చిన్న ఎపార్టుమెంటుకొన్నాను. కొంత నేను పొదుపుచేసింది. కొంత శ్రీమతి నగలు అమ్మి అది నేటికి మంచి వాల్యూ వచ్చింది. 40 లక్షలకు అమ్మాను. అందులో 30 లక్షలు మా అబ్బాయి కొన్న ఇంటికిచ్చాను.

కృమోః మిగిలిన 10 లక్షలూ?

రవి : ఆ డబ్బుతోనే 50,000డినామినేషన్స్తో 20 ఎన్ఎస్సిలు కొన్నాను.

కృమో, ; కాని మీ ఎపార్టుమెంటు సేల్డీడ్లో దానిని 10లక్షలకే అమ్మినట్టున్నది కదూ!

రవి : అవును. ఆ ఏరియాలో గవర్నమెంటు రేట్ల ప్రకారమూ, అది చాల పాత అపార్ట్మెంటు కావడమూ వల్ల 10 లక్షలకే చేసాం. సాధారణంగా ఇటువంటి సందర్భాలలో ప్రతివాడు చేసే నేరమే ఇది. కాని మా నాన్నగారు ఒక సందర్భంలో చెప్పినట్టు "ఇతరులకు అన్యాయం చెయ్యకుండా నువ్వు చేసే ప్రతి పనీ ఆమోదయోగ్యమే" అని నేను నమ్ముతాను. పైగా ఆ వచ్చిన డబ్బుని నా కొడుక్కు ఇవ్వడంలోనూ ఒక ప్రయోజనముంది. ఆ కొత్త ఇల్లు రెండు పోర్షన్స్గా ఉంది. చిన్నది మాకు కేటాయించేటట్లు, పెద్దది మా అబ్బాయితీసుకునేటట్లు ఏర్పాటు చేసుకున్నాం.

కృమో ; ఈ మేరకు ఆ డాక్యుమెంట్లో రాసుకున్నారా?

రవి : లేదు. ఆ మాత్రం నమ్మకం నా కొడుకు మీద నాకున్నది.

కృమోః సరే రవిగారూ! మీ అబ్బాయి మీద మీ నమ్మకం మెచ్చదగిందే. ఇక నా ఎంక్వయిరీ రేపటితో ముగుస్తుంది. ఇంకా మీరు చెప్పాలిసిందేమైనా ఉందా?

రవి : ఉంది. నేను బ్యాంకును గాని, మరే ఇతరులనూ గాని ఎప్పుడూ మోసం చెయ్యలేదు. నిజం చెప్పాలంటే నా నిజాయితీకి నాయింటా బయటా నా మీద ఎప్పుడూ వ్యతిరేకభావమే. ఎప్పుడో కొన్న సింగిల్ అపార్టుమెంటులోనే ఉన్నానని నా సబార్డినేట్స్ మా బంధువులు నన్ను హేళన చేస్తుంటారు. ఇక నాపిల్లలయితే మరీని, "చూడండి! నాన్నగారూ! మీతో పాటు చదివిన వాళ్లు, మీతో బ్యాంకులో చేరిన వాళ్లు, మల్టీస్టోరీడ్ బిల్డింగ్స్ కట్టుకున్నారు. కనీసం మీకొక కారు కూడ లేదు. ఇప్పటికీ మీరు బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మా సంగతి సరేసరి. మాతోటి వాళ్లందరూ హీరోహోండాల్లో కాలేజికి వస్తారు. కొందరయితే వాళ్ల స్వంత కార్లలో వస్తారు. ఈ చిన్న అపార్టుమెంటులోనే మీరు, మేమూ మా చదువులూ" అంటూ దెప్పి పొడిచేవారు. వాళ్ల కప్పుడు నేనిలా చెబుతూండేవాడిని "వంశీ! ఇంకా మీరు అదృష్టవంతులు, కాలేజీలు, ఇంజనీరింగ్ చదువులూ, ఇవి చెప్పించే తాహతూనాకున్నది. మానాన్నగారయితే ఎంత కష్టపడ్డారో మీకు చెబితే ఆశ్చర్యపోతారు. ఆయన చిన్న క్వాలిఫికేషన్తోనే ఉద్యోగం సంపాదించి, అప్పులు చేసి నన్ను పి.జి. వరకూ చదివించారు. ఆయన ముందునేనెంత?" అని వాళ్లను సముదాయించే వాడిని, పాపం వాళూ శ్రద్ధగానే చదువుకున్నారు. ఇంకొక చిన్న సంఘటన కూడ మీకు చెబుతాను. మీరు నాకన్న చాలా చిన్నవారు గనుక, ఓపిగ్గా వింటున్నారు గనుక ఈ రకంగా మిమ్మల్ని విసిగిస్తున్నాను.

కృమోః అదేంటి రవిగారూ? మీరు చెప్పేవన్నీ నాయీ ఎంక్వయిరీకి పనికి వచ్చేవే. మీ కేరెక్టర్ని వెలిబుచ్చేవే? చెప్పండి.

రవి : ఇది అంత గంభీరమైనదేం కాదు లెండి. నేను మా పెద్దబ్బాయిని కాలేజీకి సైకిలు మీద తీసుకుని వెళ్లేవాడిని, వాడి స్కూల్డేస్లో, సైకిలు రిపేరుకు ఒక సైకిల్షాపుకు వెళ్లేవాళ్లం. అక్కడుండే వర్కర్స్ని చూపుతూ వంశీ, నువ్వు శ్రద్ధగా చదువుకోవాలి. పెద్దపెద్ద చదువులు చదువుకుంటే మంచి ఉద్యోగాలు వస్తాయి అని చెప్పేవాడిని. వాడు "శ్రద్ధగానే చదువుకుంటున్నాను కదా నాన్నగారూ!" అనేవాడు. "అవును అది అవసరం. ప్రతీ క్లాసులో ఫస్టు ఛాన్సులోనే పాసవ్వాలి. లేకపోతే ఈ సైకిల్ షాపులోని వర్కర్స్ గతే నీకునూ' అనడంతో వాడు భయపడేవాడు.

కృమోః మీ దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను రవిగారూ. విష్ యూ గుడ్ లక్కై !

ఆ రోజుతో కృష్ణమోహన్ ఎంక్వయిరీ పూర్తయింది. మర్నాడు భుజంగరావుని మరల పిలిపించేరు.

కృమోః భుజంగరావు గారూ ! నిన్నటితో నా ఎంక్వైరీ పూర్తయింది. ఈ కేసులో మీ మీదే ఎక్కువ అనుమానాలు కన్పిస్తున్నాయి. మీకు మరోసారి చెబుతున్నాను. మీ ఎజియమ్ ఛాంబర్లోని కప్బోర్డులోని డబ్బు సంగతే పెద్ద మిస్టరీగా ఉన్నది. ఇక రవిగారి సేఫ్లాకర్ ఉన్న డాక్యుమెంట్ల కాపీలు మా ఆఫీసుకు కంప్లెయింటుతో పాటు అటాచ్ చేయబడ్డాయి. ఈ రెంటికే మీకు ఏమైనా సంబంధముందా?

భు : అన్యాయం సార్! నాకే పాపం తెలియదు.

కృమో: ఒక వేళ మాకు నిజాలు తెలిసి మీరే నేరస్తులని ఋజువయితేమీకు చాల పెద్ద శిక్ష పడుతుంది. ముందే మీ తప్పు ఒప్పుకుంటే మీ మీద తీసుకునే చర్యలో కొంత వెసులుబాటు చూపించవచ్చు. బాగా ఆలోచించండి. మీకిప్పుడు 5 నిముషాలు టైమిస్తున్నాను.

భు : (ఆలోచించాడు) తనలో అనుకున్నాడు. వీళ్లకు నిజాలు తెలియడం కలలో మాట. ముందే నేనెందుకు కమిటవ్వాలి. (పైకి) లేద్సార్ అసలు నేరస్తులను వదిలేసి నాలాంటి అమాయకుడి వైపు మీరు వేలు చూపిస్తున్నారు. ఇది అన్యాయం.

కృమో: దట్సాల్రైట్ ! ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు! మీరిక వెళ్లవచ్చు.

భుజంగరావు నిష్క్రమించాడు. అదే రోజు కృష్ణమోహన్ శ్యామసుందర్ని కలిశాడు.

"శ్యామ్ సుందర్ గారూ, నా ఎంక్వయిరీ పూర్తయింది. నా అబ్జర్వేషన్స్తో ఒక రిపోర్టును రేపే హెడ్డాఫీసుకు సబ్మిట్ చేస్తాను. ఈ రోజే నేను హెడ్డాఫీసుకు వెళ్లడానికి ఫ్లైట్ బుక్ చేయించండి. నాకిక్కడ మీరిచ్చిన కోఆపరేషన్కి ధన్యవాదాలు"

"ఓకె, కృష్ణమోహన్గారూ"

ఆ రాత్రికే కృష్ణమోహన్, ఆయన అసిస్టెంటూ హెడ్డాఫీసుకు వెళ్లిపోయారు.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments